క్లుప్తంగా

నారికేళం.. ధరహాసం



మార్కెట్‌లో కొబ్బరికాయలు

పెదగంట్యాడ: వరుస పండగలతో కొబ్బరికాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎన్నడూ లేని రీతిలో కొబ్బరి కాయలు ధరలు పెరగడంతో భక్తులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో రూ. 20 నుంచి రూ.25కి అమ్మే కాయలు ప్రస్తుతం రూ.40కి విక్రయిస్తున్నారు. పెద్ద కాయ రూ.50 నుంచి రూ.60 వరకూ అమ్ముతున్నారు. ఈ క్రమంలో 101, ఆపై కొబ్బరి కాయలు మొక్కుబడి ఉన్న పలువురు భక్తులు తమ మొక్కులను వాయిదా వేసుకోక తప్పడం లేదని వాపోతున్నారు. సామన్య భక్తులు కూడా అంత ధర పెట్టి కొబ్బరికాయలు కొనాలంటే ఆలోచిస్తున్నారు. పూజా సామగ్రి కలిపి సెట్టు రూ.70 నుంచి 90 వరకూ విక్రయిస్తున్నారు.

అనాథలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న పారాయణ సేవా సమితి ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడికి చెందిన శ్రీబొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం అనాథలకు ఆహార పొట్లాలు అందిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుద్ద నాగేశ్వరరావు కుటుంబ సభ్యుల సహకారంతో మంగళవారం అనాథలు, వృద్ధులకు ఆహార పొట్లాలు అందించారు. కార్యక్రమంలో పారాయణ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్నారుల సందడి



మహిషాసురమర్దిని నృత్య రూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గాజువాక: స్థానిక భాస్కర్ విద్యానికేతన్‌లో మంగళవారం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు త్రిపుర సుందరీదేవి, గాయత్రి దేవి, అన్నపూర్ణ, లక్ష్మీదేవి, సరస్వతి దేవి, రాజరాజేశ్వరి, జ్ఞానేశ్వరి, లలితాదేవి, మహిషాసురమర్దిని వేషధారణల్లో అలరించారు. అనంతరం ప్రదర్శించిన మహిషాసురమర్దిని నృత్యరూపకం విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు నెలల్లో టిడ్కో గృహాల పనులు పూర్తి



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న అధికారులు

పెదగంట్యాడ: మండలంలోని టిడ్కో గృహ సముదాయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని టిడ్కో సూపరింటెండెంట్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు, టాటా ప్రాజెక్ట్ అధికారులు స్పష్టం చేశారు. మండలంలోని టిడ్కో గృహ సముదాయాలను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులన్నీ రెండునెలల్లో పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ సుధాకర్, డీఈ రాజేష్, టాటా ప్రాజెక్ట్ మేనేజర్ హర్షవర్ధన్, ఈఈ రాజబాబు, ఏఈ గోపాల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణలో ఏఐ కీలకం



ప్రసంగిస్తున్న ఐఈఈఈ సీనియర్ మెంబర్ విక్రాంత్ భటిజా

అగనంపూడి: క్యాన్సర్ ఇమేజింగ్ ఆధారిత డయోగ్నసిస్ సిస్టంపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఐఈఈఈ సీనియర్ సభ్యుడు విక్రాంత్ భటిజా, పూర్వాంచల్ విశ్వ విద్యాలయం సీఎస్‌సీ హెడ్ వీర్ బహదూర్ సింగ్ లు మాట్లాడుతూ క్యాన్సర్ నిర్ధారణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) కీలకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాల సమస్యపై ఆప్కాస్ ఎండీకి వినతి



ఆప్కాస్ ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గాజువాక: జీవీఎంసీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల మిస్సింగ్ జీతాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ఆప్కాస్ ఎండీకి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. 2022 ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది జులై వరకు 50 మంది కార్మికులకు జీతాలు మిస్సయ్యాయని యూనియన్ నాయకులు గొలగాని టి.నూకరాజు, గొలగాని అప్పారావు ఈ సందర్భంగా ఎండీకి వివరించారు. ఈ సమస్య ప్రతినెలా ఉత్పన్నమవుతోందని పేర్కొన్నారు. దీనిపై దృష్టి సారించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో నాయకులు నక్క నాగరాజు, శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

గ్రీన్‌బెల్ట్ కనుమరుగు!

దర్జాగా ఆక్రమణలు
వాటి జోలికెళ్లని అధికారులు
పేదలపై మాత్రం పంజా



సిగ్నల్స్ వద్ద అడ్డుగా పెట్టిన స్టాపర్లు



గ్రీన్‌బెల్ట్ స్థలంలో ఏర్పాటైన మెకానిక్ షెడ్



జాతీయ రహదారిని ఆనుకొని గ్రీన్‌బెల్ట్ స్థలంలో నిర్మించిన షాపులు

కూర్మన్నపాలెం: పర్యావరణాన్ని పరిరక్షిస్తాం.. వాతావరణ కాలుష్యాన్ని నివారిస్తాం అంటూ అధికారులు చెబుతున్న మాటలు.. పాలకులు చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. పర్యావరణం కోసం ఏర్పాటు చేసిన గ్రీన్‌బెల్టులు ఆక్రమణకు గురైనా.. వాటికోసం కేటాయించిన భూములు కనుమరుగైనా పట్టించుకోకపోవడమే దీనికి నిదర్శనం. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా తీసుకుని ఆక్రమణదారులు దర్జాగా తమకు నచ్చినోట నిర్మాణాలు చేసి ఆ తర్వాత వాటిని అద్దెలకు ఇచ్చి దర్జాగా సొమ్ము చేసుకొంటున్నారు. దీంతో గ్రీన్ బెల్టు పూర్తిగా కనుమరుగు అయిపోతుంది.

ఇక్కడ మరీ దారుణం

కూర్మన్నపాలెం నుంచి వడ్లపూడి బ్రిడ్జి వరకు ఏర్పాటు చేసిన గ్రీన్ బెల్టు దుకాణాలకు అడ్డాగా మారింది. విశాఖ ఉక్కు నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన వివిధ గ్రామాల ప్రజలకు నిర్వాసితుల కోటాలో వడ్లపూడిలో ఇళ్ల స్థలాలు కేటాయించారు.దాంతా పాటు ప్రజల అవసరాల కోసం దేవాలయాలు , కమ్యూనిటీ హాళ్లు, కల్యాణమండపాలు, పార్కులతో పాటు గ్రీన్‌బెల్టుకు సైతం స్థలం కేటాయించారు. అందులో మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని యోచించారు. అది ఆచరణకు నోచుకోకపోవడంతో కొందరు దళారులు అక్రమార్కులతో చేతులు కలిపి గ్రీన్‌బెల్టుపై కన్నేశారు. స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం ప్రారంభించారు. ఆ తర్వాత షాపింగ్ కాంప్లెక్సులు గా మార్చేసి వాటిని అద్దెలకిచ్చి రెండు చేతులా సంపాదిస్తున్నా రు. ఇప్పుడు ఆప్రాంతంలో గ్రీన్ బెల్టు ఆనవాళ్లే కనబడడం లేదు. మొక్కలు, చెట్లు ఉండాల్సిన స్థలాల్లో బ్రాందీ షాపులు, కార్లషెడ్లు, ఇతర వాణిజ్య, వ్యాపార సంస్థలు, దుకాణాలు దర్శనమిస్తున్నాయి.

పేదలపైనే పంజా

తాజాగా రోడ్లపక్కన ఉన్న చిన్న చిన్న దుకాణాలను అధికారులు తొలగిస్తుండడంతో గ్రీన్‌బెల్టు అంశం తెరమీదకు వచ్చింది. బతుకు తెరువు కోసం జీవిస్తున్న తమ పొట్టపై కొడుతున్న అధికారులు, ఏకంగా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపట్టిన వారి జోలికెళ్లడం లేదని మండిపడుతున్నారు. తాము బతకడానికి రోడ్డెక్కి వ్యాపారాలు చేసుకుంటున్నామని.. గ్రీన్ బెల్టులో ఉన్నవాళ్లు అద్దెలకిచ్చి దండిగా సంపాదిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. వడ్లపూడి ప్రధానరహదారి, కూర్మన్నపాలెం రోడ్డు, సంతతోట తదితర ప్రాంతాల్లో బడ్డీలను తొలగించారు. కాని ఇప్పటి వరకు గ్రీన్ బెల్టులో షాపుల జోలికి వెళ్లలేదు. ఇదేమని ఎవరైనా అడిగితే తమకు సంబంధం లేదని సిబ్బంది చెప్పేస్తున్నారు. దీంతో తమపై ప్రభుత్వం కక్ష కట్టిందని పేదలు వాపోతున్నారు. గ్రీన్‌బెల్ట్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

పేదలకు న్యాయం చేయాలి



ఆక్రమణల పేరిట అధికారులు పేదల బడ్డీలు తొలగించారు. పెద్దల జోలికి వెళ్లలేదు. ఇది ఒక రకంగా చెప్పాలంటే పేదలపై ప్రభుత్వ దాడే. దీని వల్ల అనేక మంది రోడ్డున పడ్డారు. వారందరికీ ప్రభుత్వం న్యాయం చేయాలి. గ్రీన్‌బెల్ట్ ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి.

– ఇల్లపు రాము, వైఎస్సార్‌సీపీ నాయకుడు, 87వ వార్డు

ఎలా బతకాలి?



నేను ఎన్నో ఏళ్లుగా వడ్లపూడి రోడ్డు పక్కన బడ్డీ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాను. ఇప్పటి వరకు ఎవరూ నన్ను ఏమీ లేదు. కానీ అధికారులు చెప్పాపెట్టకుండా బడ్డీ తొలగించేశారు.మేము ఎలా బతకాలో తెలియడం లేదు.

– వంగలి రమణమ్మ, బాధితురాలు

పేదలపై ప్రతాపమా ?



నేను ఎక్కడ నుంచో వలస వచ్చాను. పానీపూరి అమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. అధికారులు ఒక్కసారిగా నా బండి తొలగించారు. పెద్దలను వదిలేసి మాలాంటి పేదల మీద పడ్డారు. మాలాంటి వాళ్లం ఎలా బతకాలి.. ఎక్కడికి పోవాలి.

– అజయ్‌కుమార్ సింగ్, పానీపూరి వ్యాపారి

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో అన్యాయం




సెమినార్‌లో ప్రసంగిస్తున్న మాజీ ఐఏఎస్ విజయకుమార్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, పీడబ్ల్యూడీ, నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాజీ ఐఏఎస్ జి.ఎస్.ఆర్.కె. విజయకుమార్ అన్నారు. స్టీల్ ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టీల్‌క్లబ్ లో 'ప్రైవేటీకరణ ప్రభావం – కర్తవ్యం ' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్యవక్తగా పాల్గొన్నారు. దేశంలో లిబరలైజేషన్, గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్ సిద్ధాంతాలు అమల్లో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సామాజిక న్యాయం అమల్లో భాగంగా ప్రభుత్వ రంగంలో ఉంచాల్సిన స్టీల్ రంగాన్ని నాన్ స్ట్రాటజిక్ సెక్టార్‌లోకి మార్చడం ద్వారా ప్రైవేటీకరణకు ద్వారాలు తెరిచారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టి సామాజిక న్యాయం నుంచి క్యాపిటలిజం వైపు పయనిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయడం ద్వారా హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చా రు. భవిష్యత్తులో ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మిక సంఘాలు, అసోసియేషన్లు కలిసి పోరాట ప్రణాళిక తయారు చేస్తే తాను కూడా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతానన్నారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి. తౌడన్న, బయ్యే మల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో మాజీ సీజీఎం కె. సత్యం, మనోజ్ ఓరాన్, వివిధ అసోసియేషన్ల నాయకులు జి. సత్యనారాయణ, మాటూరి శ్రీనివాసరావు, కె. పరంధామయ్య, వై.టి. దాస్, సంతోష్‌కుమార్, బి. శ్యామ్, రవిప్రకాశ్, ఎస్.భాలబాస్కరరావు, బి. అప్పారావు, ఎం.పెంటారావు, ఎస్. మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురమ్మలకు జేజేలు



గాయత్రీదేవిగా అగనంపూడి దుర్గాలమ్మ



గాయత్రిదేవిగా మహాదుర్గ



విద్యాలక్ష్మిఅవతారంలో మహాలక్ష్మి



సరస్వతీదేవిగా మహా సరస్వతి

ఉక్కునగరం: మహాదుర్గ,మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు వెలసిన ఉక్కునగరం త్రిశక్తి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా రెండో రోజు మంగళవారం మహాదుర్గ అమ్మవారు ముదురు ఎరుపు చీరలో గాయత్రీదేవి అవతారంలో, మహాలక్ష్మి అమ్మవారు గులాబీ వర్ణం చీరలో విద్యాలక్ష్మిగా, మహాసరస్వతి అమ్మవారు ఆకుపచ్చ వర్ణం చీరలో సరస్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో ఉదయం అమ్మవార్లకు సహస్ర సంపెంగ పుష్పార్చన చేశారు. సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని దుర్గాలమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మంగళవారం గాయత్రీదేవిరూపంలో దర్శనమిచ్చారు. అగనంపూడి పరిసర కాలనీల నుంచి అధిక సంఖ్యలోభక్తులు పాల్గొని అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి విష్ణు, లలిత సహస్ర పారాయణ పఠనం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జగన్మాతా పాహిమాం..

గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం



డంపింగ్ యార్డ్ వద్ద పూజలు చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్



వాసవీమాతకు పూజలు చేస్తున్న భక్తులు



గాయత్రీదేవిగా దుర్గాదేవి

పెదగంట్యాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్‌బోర్డు కాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలోవాసవీమాతను దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ఖడ్గమాల సహిత, అష్టోత్తరశతనామార్చన, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, కొల్లా అప్పలరాజు, మెగలపల్లి త్రిమూర్తులు, బోండాడ వెంకటేశ్వరరావు, బిట్టూరి వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.
- బర్మాకాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సబ్బవరపు సన్యాసిరావు ఆధ్వర్యంలో భక్తులు దుర్గాదేవి పారాయణం, నామసంకీర్తన చేశారు.
- డంపింగ్ యార్డ్‌లో సిబ్బంది ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో జోన్–6 ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు

కూర్మన్నపాలెం: వివాదాస్పదమైన ఆక్రమిత స్థలాన్ని గాజువాక తహసీల్దార్ శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. సర్వేయర్‌తో కొలతలు వేయించి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జాయింట్ సర్వే నిర్వహించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

ఇదీ విషయం

జీవీఎంసీ 87వ వార్డులోని సిద్ధార్థనగర్‌కు ఆనుకొని గతంలో చెరువు ఉండేది. అయితే కాలనీ అభివృద్ధి చెందడంతో చెరువు ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఆ ప్రాంతంలో స్టేడియం నిర్మించాలని యోచించి చదును చేయించారు. అంతేకాకుండా స్టేడియం నిర్మాణానికి నిధులు కూడా కేటాయించారు. అయితే ఈ లోగా మాడిశ దుర్గారావు, నూకరత్నం కొంత స్థలంలో ప్రహరీ నిర్మించి దానిపై పేరు సర్వేనెంబర్ రాయించారు. దానిపై అనేకమంది అధికారులకు ఫిర్యాదు చేయడంతో పలుమార్లు సర్వేచేయించారు. అయినా క్లారిటీ రాకపోవడంతో తహసీల్దార్ స్వయంగా వచ్చి పరిశీలించారు. సర్వేయర్ జనార్ధనరావు స్టీల్‌ప్లాంట్ స్థలం కొంత ఉన్నట్టు చెప్పడంతో స్థానిక యువకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో జాయింట్ సర్వే నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

సమయ పాలన పాటించాలి

మహారాణిపేట: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(యూపీహెచ్‌సీ)ల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ, మెరుగైన సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన గాజువాక సమీపంలోని మింది,తదితర యూపీహెచ్‌సీలను సందర్శించి పలు సూచనలు చేశారు. స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు, ల్యాబ్ టెస్టులు, క్యాన్సర్, ఎన్‌సీడీ స్క్రీనింగ్, టీబీ, పీఎంజేఏవై తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

హరికృష్ణకు సత్కారం



హరికృష్ణను సత్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి బొర్రమాంబ నగరకాలనీకి చెందిన ఉప్పా హరికృష్ణ జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 21న భీమవరంలో నిర్వహించిన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో హరికృష్ణ ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నాడు. వచ్చే డిసెంబర్ 5 నుంచి7 వరకు ఢిల్లీలో జరగబోయే జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా హరికృష్ణను మంగళవారం ప్రజా సంఘాల నాయకులు సత్కరించారు. కాగా హరికృష్ణకు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీకి చెందిన నిర్వాసిత సంఘ నాయకుడు కర్రి దశేంద్ర ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు గవర సోమశేఖర్, డొక్కా రమేష్, విందుల రాజు, గొల్లవిల్లి నూకరాజు, సింగిడి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌కు దారి ఎటు?



రాజీవ్‌నగర్‌కూడలి వద్ద నేలకొరుగుతున్న బోర్డు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటి, నాలుగు ప్లాట్‌ఫారాలపై వెళ్లేందుకు ప్రయాణికులు తికమక పడుతున్నారు. కొత్తవారు స్టేషన్‌కు వెళ్లాలంటే గందరగోళం మధ్య ఒకటో నంబర్‌కు బదులు నాలుగు నంబర్‌కు వెళ్లిపోవాల్సి వస్తుంది. కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్ మీదుగా దువ్వాడ వెళ్లే ప్రయాణికులు దాదాపు ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపే వెళ్లాలి. అధిక శాతం మంది విజయవాడ మీదుగా రాకపోకలు సాగించేవారే ఉంటారు.

బోర్డు సరిగ్గా లేక తికమక : ఈమార్గంలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సూచికబోర్డు ఒరిగి పోవడంతో ప్రయాణికులు తికమక పడుతున్నారు. ఏడాది నుంచి ఇలాగే ఉన్నా స్పందన లేదు. వంతెన మీద నుంచి వెళ్తే నాలుగో ప్లాట్‌ఫారం వంతెనకు కుడి, ఎడమ వైపు నుంచి వెళ్తే ఒకటో నంబర్ ప్లాట్‌ఫారానికి చేరుకుంటారు. ఈ మార్గాలను స్పష్టంగా చూపించకపోవడం వల్ల గందరగోళానికి గురవుతున్నారు. సగం నేలకొరిగిన బోర్డుకు అమ్మవారి ఉత్సవాల ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంతో అక్షరాలు కనపడని పరిస్థితి. అధికారులు స్పందించి కొత్త బోర్డు ఏర్పాటు చేసి మూడు వైపులా ప్లాట్‌ఫామ్‌లను సూచించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో నష్టం



తహసీల్దార్ అమలకు వినతిపత్రం అందజేస్తున్న వాయిస్ ఆఫ్ గాజువాక సభ్యులు

పెదగంట్యాడ: అదానీ పోర్టు యాజమాన్యం సిమెంట్ ఫ్యాక్టరీ పెడితే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వాయిస్ ఆఫ్ గాజువాక ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అధ్యక్ష, కార్యదర్శులు చిక్కా సత్యనారాయణ, టీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు హేమంత్ మంగళవారం పెదగంట్యాడ తహసీల్దార్ అమలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల జరిగే నష్టాలను వివరించారు. ఇప్పటికే ఈ ప్రాంత ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతున్నారన్నారు. ఈ క్రమంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు తగదని స్పష్టం చేశారు.